క్లుప్తంగా

అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వారాహి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం శ్రీచక్ర అభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి సామూహిక శ్రీ లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. 6.30 గంటలకు సామూహిక కుంకుమ పూజ, అనంతరం పంచ హారతులు, వేద మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా 108 మంది ముత్తయిదువులకు వడి బియ్యం వితరణ చేశారు.

9, 10 తేదీల్లో ఆర్టీసీ బస్టాండులో వేలం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ ఏలూరు కార్గో పాయింట్‌లో మిగిలిపోయిన 371 వస్తువులను ఈ నెల 9, 10 తేదీల్లో వేలం వేయనున్నట్టు ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ జీఎల్‌పీవీ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ లాజిస్టిక్ నిబంధనల ప్రకారం ఏలూరు కొత్త బస్టాండులోని 15వ నెంబర్ ప్లాట్ ఫారం వద్ద ఉదయం 10 గంటల నుంచి బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చని, అప్పటికప్పుడే పైకం చెల్లించి వస్తువు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టౌన్: నగరంలోని 4వ డివిజన్ మారుతీ నగర్‌లో స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే బడేటి చంటి సోమవారం తెల్లవారుజామున డివిజన్‌లో పారిశుధ్య పరిస్థితులను పర్యవేక్షించారు. పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా ఉండడంతో అధికారులు, సిబ్బందిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్రెయినేజీ పూడిపోవడంతో పాటు ఆక్రమణలకు గురికావడంతో మురుగునీరు రోడ్లపైనే ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాత్కాలికంగా కచ్చా డ్రెయిన్ ద్వారా నీటిని మళ్లిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, హెల్త్ ఆఫీసర్ మాలతి తదితరులు ఉన్నారు.

వైఎస్ హయాం స్వర్ణయుగం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నాని
- ఏలూరులో ఘనంగా జయంతి కార్యక్రమాలు


ఏలూరు టౌన్: పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నాని


ఏలూరు టౌన్: ఫిలాస్‌పేట సెంటర్‌లో నివాళులర్పించిన శ్రీలక్ష్మి, నాయకులు

ఏలూరు టౌన్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయంలో రాష్ట్రంలో పేదలకు స్వర్ణయుగాన్ని తెచ్చారని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. డాక్టర్ వైఎస్సార్ జయంతి కార్యక్రమాన్ని సోమవారం పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్‌ను కట్ చేసి పార్టీ నేతలకు, క్యాడర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, అత్యవసర సేవల 108 అంబులెన్స్, 104 సంచార వైద్య శాల వాహనాలను ప్రవేశపెట్టిన మహనీయుడని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధిని జతచేస్తూ ప్రజలకు స్వర్ణయుగాన్ని రుచిచూపించారని గుర్తు చేశారు. ఆయన మరణానంతర ప్రభుత్వాలేవీ పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. కానీ, 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టటంతో పేదలకు రాజన్న రాజ్యాన్ని మరోసారి గుర్తు చేస్తూ సంక్షేమ పాలన అందించారని వివరించారు. పథకాలతో పేదలను ఆదుకోవటమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధిలో తనదైన శైలిలో ముద్ర వేశారని, అవినీతి లేని అద్భుత పాలన అందించారని చెప్పారు. పార్టీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ దేశానికే ఆదర్శవంతమైన పాలన అందించారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించారని తెలిపారు. పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయాల సాధనకు కృషి చేయాలని, జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు బొద్దాని అఖిల, జిజ్జువరపు విజయ నిర్మల, ఇమ్మానియేల్ జయకర్, పొలిమేర దాసు, సుంకర చంద్రశేఖర్, గుడిపూడి శ్రీనివాస్, దేవరకొండ శ్రీనివాస్, అద్దంకి విజయకుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, రాష్ట్ర నాయకులు కిలాడి దుర్గారావు, నున్న కిషోర్, మట్టా రాజు, పిట్టా ధనుంజయ్, జేసీఎస్ కన్వీనర్ మోటమర్రి సదానందం, ఇనపనూరి జగదీష్, అర్జి నాగేశ్వరరావు, మున్నీ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ పాలన దేశానికే ఆదర్శం

ఆదర్శవంతమైన సంక్షేమ పాలనతో దేశానికి చాటి చెప్పిన మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అని రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. వన్‌టౌన్ తూర్పువీధి ఫిలాస్‌పేట సెంటర్‌లోని వైఎస్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 6, 7, 8, 9 డివిజన్ల కార్పొరేటర్ల ఆధ్వర్యంలో వైఎస్ జయంతి వేడుక నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. వైఎస్ ఆశయాలను సాధించేందుకు పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల పాటు సంక్షేమ పాలనతో ప్రజల మనస్సును గెలుచుకున్నారని శ్రీలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుంకర చంద్రశేఖర్, వంకదారు ప్రవీణ్‌కుమార్, సబ్బన శ్రీనివాస్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

29, 47వ డివిజన్లలో..

వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్ ఆధ్వర్యంలో వైఎస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మేతర సురేష్, కట్టెంపూడి వెంకట రంగారావు,

వంగాయగూడెం సెంటర్‌లో..

19వ డివిజన్ కార్పొరేటర్ ఇనపనూరి కేదారేశ్వరి, జగదీష్ ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు సొంగా మధు, బట్టు విజయలక్ష్మి, పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

బధిరుల సమక్షంలో..

ఏలూరు రూరల్ : దొండపాడు పరివర్తన బధిరుల పాఠశాలలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడ్డ సుధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామ్మోహనరావు వైఎస్ చిత్రపటానికి పూలమాల వేశారు. వైఎస్సార్ సేవలను కొనియాడారు. పిల్లలతో కేక్ కట్ చేశారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. ఏలూరు రూరల్ మండల మానూరు గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ అధ్వర్యంలో ఎస్సీ పెద్దలు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పిల్లలు, పెద్దలకు మిఠాయిలు పంచారు.

పేదల పాలిట దేవుడు వైఎస్సార్

ఏలూరు (టూటౌన్): పేదల పాలిట దేవుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని ఏలూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మేతర సురేష్ అన్నారు. సోమవారం స్థానిక 44వ డివిజన్ గన్‌బజారులోని వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల ఆరాధ్యుడు, పేదల పాలిట పెన్నిధి నిత్యం పేదల సంక్షేమం కోసం అహర్నిశలు పరితపించిన మహానీయుడు వైఎస్సార్ అని గుర్తు చేశారు. వైఎస్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు. కార్యక్రమంలో గన్‌బజార్ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు టౌన్: టూటౌన్ ప్రాంతంలో నివాళులర్పించిన జాన్, శ్రీనివాసరావు


ఏలూరు టౌన్: వంగాయగూడెంలో పార్టీ నేతలు జగదీష్, మధు, విజయలక్ష్మిల నివాళి


ఏలూరు రూరల్ : బధిరుల పాఠశాలలో కేకు కోస్తున్న చిన్నారులు


ఏలూరు (టూటౌన్): వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎంసీ మాజీ డైరెక్టర్ మేతర సురేష్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు

ఏలూరు టౌన్: ఏలూరు త్రీటౌన్ పరిధిలో ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే సహించేది లేదని ఏలూరు త్రీటౌన్ ఇన్‌చార్జి సీఐ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఏలూరు నగరంలో పలువురు మైనర్లు మోటారు సైకిళ్ల నడపడాన్ని గమనించిన త్రీటౌన్ సీఐ వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు మోటారు సైకిళ్లు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏలూరు నగరంలో మోటారుసైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. సంబంధించిన రికార్డు, ఇన్సూరెన్సు, వాహనం నడిపే వారు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్సు కల్గి ఉండాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

13న హిందీ పద్య పఠన పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పవర్‌పేట హిందీ నికేతన్ వజ్రోత్సవాల సందర్భంగా 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు ఈనెల 13వ తేదీన హిందీ పద్య పఠన పోటీలు నిర్వహించనున్నట్టు హిందీ నికేతన్ కార్యదర్శి పి.కవితా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు హిందీ నికేతన్‌లో నిర్వహించే పోటీలకు ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 11వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 94403 43295లో సంప్రదించాలని కోరారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

ఏలూరు (టూటౌన్): నగరంలో అధ్వానంగా మారిన రోడ్లకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని, డ్రెయినేజీల్లో పూడిక తీసి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని కోరుతూ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అపారిశుధ్యం కారణంగా దోమలు విస్తృంభించి ప్రజలకు వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పోరాటాలతోనే డిమాండ్ల సాధన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పోరాటాల ద్వారానే డిమాండ్లను సాధించుకోవచ్చని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి అన్నారు. యూటీఎఫ్ నగర శాఖ స్వర్ణోత్సవాల సందర్భంగా నగరంలోని పలు మున్సిపల్ పాఠశాలల్లో సోమవారం సభత్వ క్యాంపెయిన్ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఈడే శివశంకర రావు, నగర గౌరవాధ్యక్షుడు ఎం చిట్టిబాబు, అధ్యక్షురాలు షేక్ పర్వీన్ భేగం, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరులోనే శిక్షణ ఏర్పాటుచేయాలని వినతి


గాంధీజీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సేన శ్రేణులు

ఏలూరు (టూటౌన్): ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రతి లబ్ధిదారులకు శిక్షణ ఇచ్చి, వెంటనే రుణాలు మంజూరు చేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన లబ్ధిదారులతో కలిసి ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మీ కోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణికి వినతి పత్రం అందజేశారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న ఏలూరు జిల్లాకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాల వారికి ఏలూరులోనే శిక్షణ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై జేసీ లావణ్యవేణి సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుని ఇండస్ట్రియల్ డైరెక్టర్‌కు సూచించారని రవిప్రకాశ్ తెలిపారు.

యూనియన్ బలోపేతానికి కృషి


డీఎంహెచ్‌ఓ శర్మిష్టను కలిసి యూనియన్ నాయకులు

ఏలూరు టౌన్: ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 3184ను మరింత బలోపేతం చేస్తూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జె.విల్సన్‌బాబు, జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పారావు, జిల్లా సెక్రటరీ జె.గోవిందరావు తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శర్మిష్టను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఉత్తర్వులను జిల్లా వైద్య శాఖాధికారులు విధిగా పాటిస్తూ, నిబంధనలు అమలు చేయాలని కోరారు. డీఎంహెచ్‌ఓ శర్మిష్ట మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులందరికీ న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భట్టు విజయవర్ధన్ బాబు, కాపా నాగరాజు, బేబి రవీంద్రబాబు, ఏడుకొండలు, ఆరోగ్య కార్యకర్తలు బి.విజయ శ్యామల, విజయమేరీ తదితరులున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు - తిరుపతి	16.00	4830	29

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	88
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	10, 15
బెండకాయలు	30	కంద	60
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	34
కాకర కాయలు	52	కీరా దోస	44
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	100
బీరకాయలు (పందిరి)	44	అల్లం	180
క్యాబేజీ	42	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32-54	పాలకూర	12
దొండకాయలు	30	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	60	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	52

వార్డు సచివాలయం తరలింపు


నరసింహారావుపేటలో వార్డు సచివాలయానికి తాళం వేసిన దృశ్యం


సచివాలయాన్ని మెయిన్ రోడ్డు అవతల వైపునకు మార్చినట్టు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

నరసింహారావుపేట ప్రజలకు ఇబ్బందులు

ఏలూరు (టూటౌన్): నగరంలోని నరసింహారావుపేటలోని వార్డు సచివాలయాన్ని ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా వేరే ప్రాంతానికి తరలించడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో స్థానిక ఇండోర్ స్టేడియం పక్కనే ఉన్న అన్నా క్యాంటీన్ బిల్డింగ్‌లో ఏలూరు కార్పొరేషన్ యంత్రాంగం వార్డు సచివాలయం ఏర్పాటుచేసింది. దాదాపు ఐదేళ్ల పాటు స్థానిక ప్రజలు తమ అవసరాలకు సచివాలయానికి వచ్చి వెళ్లేవారు. ప్రధానసెంటర్లో అందరికీ అందుబాటులో ఉండే ఈ సచివాలయానికి అన్నా క్యాంటీన్లను తిరిగి పునఃప్రారంభించనున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో తాళం వేయడం చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని అన్నా క్యాంటీన్ల నిర్వహణ కోసం ఉన్న వార్డు సచివాలయాన్ని మూసివేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తరలింపు సమాచారం ఇవ్వని అధికారులు

స్థానిక ఇండోర్ స్టేడియం పక్కనే జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న వార్డు సచివాలయం తరలింపుపై ఇటు నగర పాలక సంస్థ అధికారులు, అటు వార్డు సచివాలయ సిబ్బంది ముందస్తు సమాచారం ఇవ్వకుండా దూరంగా తరలించడం పట్ల ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. వార్డు సచివాలయ సిబ్బంది సచివాలయం వద్ద చిన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఫ్లెక్సీలో జిల్లా పరిషత్ ఆఫీస్ మెయిన్ గేట్ ఎదురు రోడ్డులో వార్డు సచివాలయాన్ని ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నా.. దాన్ని వెదికి పట్టుకోవడానికి చాలా అవస్థలు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మార్చిన సచివాలయం వద్ద ప్రజలకు తెలిసే విధంగా బోర్డులు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

వినికిడి పరికరం అందజేత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక చాటపర్రు రోడ్డులోని ఏలూరు లయన్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏలూరు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మానేపల్లి రామారావు సహకారంతో ధనలక్ష్మి అనే మహిళకు వినికిడి పరికరాన్ని చంటి అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర, రీజియన్ చైర్మన్ ఉడత రత్నకుమార్, జోన్ చైర్మన్ పిచికల లక్ష్మి నారాయణ, వేమా కోటేశ్వరరావు, ఎం చలపతి రావు, కంది బాలకృష్ణ, తమ్మన సుహాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో బ్లీచింగ్ పనులు

దెందులూరు: విద్యార్థులకు అనారోగ్య పరిస్థితులు తలెత్తకుండా మేధినరావుపాలెం ఉన్నత పాఠశాలలో గ్రౌండ్, కిచెన్ షెడ్, బాత్‌రూమ్స్, తరగతి గదుల బయట బ్లీచింగ్ చల్లిస్తున్నామని గ్రామ సర్పంచ్ ఎన్.దుర్గాకుమారి రాజు అన్నారు. సోమవారం వైద్యసిబ్బంది, పంచాయతీ సిబ్బందితో బ్లీచింగ్ పనులను చేయించారు.

టీడీపీ దాడులపై ఖండన

టి.నరసాపురం: వేలేరుపాడు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్‌పై టీడీపీ శ్రేణులు దాడులను వైఎస్సార్ సీపీ టి.నరసాపురం మండల కన్వీనర్ శ్రీనురాజు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపులకు పాల్పడుతూ దాడులు చేస్తున్నారని, ఇవి పిరికిపంద చర్యలని పేర్కొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు


కూర్మావతారంలో జగన్నాథుడు

ద్వారకాతిరుమల: కూర్మావతారంలో జగన్నాథుడు సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. చినవెంకన్న ఆలయానికి దత్తత ఆలయమైన లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. శంఖు, చక్రాలను ధరించి భక్తులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్టుగా ఉన్న జగన్నాథుని కూర్మావతారం భక్తులకు కనువిందు చేసింది.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పోలవరం రూరల్: వర్షాకాలంలో గోదావరి వరదలు, కొండవాగుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పవన్‌కుమార్ హెచ్చరించారు. వర్షాల సీజనులో గోదావరి వరదల ప్రవాహం, కొండవాగుల ప్రవాహం ఎక్కువగా ఉంటుందని ప్రజానీకం కొండవాగులు దాటే సందర్భంలో, గోదావరి ప్రయాణాలు చేసే సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు, యువకులు స్నానాలకు ఉపక్రమించడం, సెల్ఫీల కోసం ప్రయత్నాలు చేయరాదని సూచించారు. వర్షాలు వరదల వలన వన్యప్రాణులు, పాములు జనావాసాల మధ్యకు వచ్చే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండి 94407 96664 సెల్ నంబరుకు తెలపాలని కోరారు.

నేడు విద్యుత్ బిల్లు చెల్లింపుపై అవగాహన

దెందులూరు: గోపన్నపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం విద్యుత్ బిల్లుల చెల్లింపు, యాప్‌ల వాడకంపై విద్యుత్ శాఖ అవగాహన సమావేశం నిర్వహిస్తుందని గోపన్నపాలెం ట్రాన్స్‌కో లైన్‌మెన్ రామకృష్ణ తెలిపారు. పంచాయతీ శివారు ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ఈ అవగాహన సమావేశానికి హాజరుకావాలన్నారు. అనంతరం విద్యుత్ బిల్లులు కట్టించుకోవడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.